క్లుప్తంగా

వందరోజుల ప్రణాళికను అమలు చేయాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీఓ సునీత

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన వంద రోజుల ప్రణాళికలను పకడ్బందీగా అమలయ్యేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని బాలిక విద్యాభివృద్ధి అధికారిణి (జీసీడీఓ) సునీత సూచించారు. మంగళవారం ఆమె మండల కేంద్రం సి.బెళగల్‌లోని కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. 10వ తరగతి బాలికలతో ప్రత్యేకంగా సమావేశమై, పాఠ్యాంశాల బోధనలపై ఆరా తీశారు. అదేవిధంగా ఉపాధ్యాయినులతో సమావేశం నిర్వహించి పదవ తరగతి విద్యార్థినుల ఉత్తీర్ణతపై చర్చించారు. పంచతంత్ర వంద రోజుల ప్రణాళికల నిర్వహణపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎస్‌ఓ జ్యోతికి, టీచర్లకు ఆమె సూచించారు.

వైజ్ఞానిక అంశాలపై ఆసక్తిని పెంపొందించుకోవాలి



స్టాళ్లను తిలకిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు

సి.బెళగల్: పాఠశాలల స్థాయి నుంచి విద్యార్థులు వైజ్ఞానిక అంశాలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండలంలోని పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రమా విద్యార్థులతో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి, విద్యార్థులకు శాస్త్రీయ అంశాలు, ప్రాముఖ్యతను తెలియజేశారు.

సమ్మెలో అంగన్‌వాడీ వర్కర్లు



నిరసన దీక్ష చేపట్టిన అంగన్‌వాడీ సిబ్బంది

పాణ్యం: స్థానిక బస్టాండ్ వద్ద అంగన్‌వాడీ వర్కర్లు మంగళవారం సమ్మె చేపట్టారు. వీరికి మద్దతుగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



ట్యాంక్ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి

కల్లూరు: ఓఆర్‌హెచ్‌ఎస్ ట్యాంక్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా బస్తిపాడు గ్రామంలో నిర్మిస్తున్న ట్యాంకు, జగనన్న కాలనీలో పైపు లైన్ పనులను ఆయన పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి ఉన్నారు.

వేతనాలు పెంచాలి



సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్.. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె నిర్వహించారు. అంగన్‌వాడీలు వసంతమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

17న సాహిత్యోపన్యాసం

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఈనెల 17న పండుగ సుబ్బారెడ్డి స్మారకోపన్యాసం ఏర్పాటు చేసినట్లు సదస్సు అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఉదయం 10 గంటలకు 'విశ్వనాథ సత్యనారాయణ వేయిపడగలు – సనాతన ధర్మం' అంశంపై సాహిత్యోపన్యాసం ఉంటుందన్నారు. కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం అతిథి ఆచార్యులు సాహిత్య రత్న డాక్టర్ గండ్ర లక్ష్మణ రావు ముఖ్య వక్తగా హాజరై ప్రసంగిస్తారన్నారు.

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- నన్నూరులో రెండో రోజు కొనసాగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ క్యాలెండర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: అనారోగ్యంతో బాధపడే నిరుపేదలకు అవసరమైతే కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు అందజేస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. మంగళవారం మండలంలోని నన్నూరు గ్రామ సచివాలయం–2 పరిధిలోని కమ్మగేరి, బోయపేట, మొల్ల వీధి, చింతకాయ పేట, కురువగేరి, హరిజనవాడ, సొసైటీ కాలనీలలో ఎమ్మెల్యే అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. గ్రామ సర్పంచు బ్రహ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శ్రీరెడ్డి చెన్నారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాషా హాజరయ్యారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలు, అవినీతిరహిత పాలన గురించి ప్రజలకు వివరించారు. నాలుగున్నరేళ్లలో అందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్లను అందజేశారు. ఇంక ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కొందరు, ఇంటి స్థలాలు కావాలని మరికొందరు కాలనీ వాసులు ఎమ్మెల్యేకు విన్నవించగా వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని ప్రజలను కోరారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపండి

గడప గడపకు మన ప్రభుత్వం పూర్తయిన సచివాలయాల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే పంచాయతీ రాజ్ ఏఈ రామసుబ్బారెడ్డిని ఆదేశించారు. కార్యక్రమం ద్వారా వచ్చే నిధులతో గడప గడపలో వచ్చిన సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. హరిజనవాడలో రహదారి సమస్యను రాజీమార్గంలో పరిష్కరించాలని స్థానిక నాయకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగ ప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దారం రఘురామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఫాతిమాబీ, కుసుమలత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మాటలు నమ్మొద్దు



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, తదితరులు

- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా పేదందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ స్పష్టం చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు ప్రజలను మభ్యపెట్టేందుకు కత్రలు పన్నుతున్నారని, వారి మాయమాటలు నమ్మొద్దని కోరారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని రేమట గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలంటే ? కార్యక్రమానికి జెడ్పీటీసీ ప్రసన్నకుమార్‌తో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా గ్రామ సచివాలయంలో ఆ గ్రామానికి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నవరత్నాలు పథకాలతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. మొన్నటి వరకు ఈ పథకాలతో రాష్ట్రం .... శ్రీలంక అయిపోతుందని తప్పుడు ప్రచారం చేసిన టీడీపీ నేతలు ఇప్పుడు పేర్లు మార్చి మేము అమలు చేస్తామని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ ఎన్నికల జిమ్మిక్కులను నమ్మొద్దని, ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు. నవరత్నాలు పథకాలతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఒకప్పుడు సంక్షేమ పథకాలకు అర్హత పొందాలంటే రోజుల తరబడి ఆయా గ్రామాల్లోని పెత్తనం చేసే నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, అయినా అయినా న్యాయం జరిగేది కాదన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, అర్హత ఉంటే చాలు మీ ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయని గుర్తు చేశారు.

రేమట గ్రామానికి రూ.28.12 కోట్ల లబ్ధి

రేమట గ్రామాభివృద్ధికి, ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.28,12,02,200 లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ గుర్తు చేశారు. గ్రామాభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తున్నామన్నారు. ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా కుల, మత, ప్రాంతాలకు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు జరిగాలంటే ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన జగనన్నను మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండాను నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ తిరుమల్ రెడ్డి, ఎస్.సంపత్‌కుమార్, స్థానికులు సురేష్, ఆనంద్, జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లద్దగిరిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గాడి రూతమ్మ

కోడుమూరు: ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులందరికీ నేరుగా ప్రభుత్వ ఫలాలు అందజేస్తున్నారని కోడుమూరు ఎంపీపీ గాడి రూతమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని లద్దగిరి గ్రామ సచివాలయంలో ఎంపీపీ గాడి రూతమ్మ ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, సీఎం జగన్ చేసిన మేలును ప్రజలకు వివరించారు. 33 సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగాను సచివాలయం పరిధిలో లబ్ధి పొందిన వివరాల బోర్డును మండల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎంపీపీ ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, విద్యావసతి, వైఎస్సార్ ఆసరా వంటి సంక్షేమ పథకాల లబ్ధిని మహిళల ఖాతాల్లో జమ చేస్తూ సీఎం జగనన్న మహిళలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని, ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలవాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓఆర్డీ మంజుల, పీఎస్ వెంకటేశ్వర్లు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు బందెనవాజ్, గిడ్డయ్య, మద్దయ్య, గోవిందు, నరసింహులు, అక్బర్, దుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడలను జయప్రదం చేయండి



గోరంట్లలో హైస్కూల్ మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్ : గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌ను జయప్రదం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం మండలంలోని కోడుమూరు, లద్దగిరి, గోరంట్ల గ్రామాల్లో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓఆర్డీ మంజుల పర్యటించి హైస్కూళ్లలోని మైదానాలను పరిశీలించారు. పీఈటీలతో క్రీడా పోటీలపై చర్చించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈనెల 15నుంచి జనవరి 21వతేదీ వరకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌లో భాగంగా వాలీబాల్, కబడీ, ఖో–ఖో, క్రికెట్, బాడ్మింటన్ పోటీలను గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తోందన్నారు. ఈ పోటీల్లో 15సంవత్సరాలు పైబడిన క్రీడాకారులంతా పాల్గొనేందుకు అవకాశముందని, సచివాలయంలో పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

గూడూరు రూరల్: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. కె.నాగలాపురంలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా సభ్యత్వ నమోదు వివరాలను సచివాలయంలో ఆయన అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఆయా క్రీడా పోటీలకు అవసరమైన వస్తు సామాగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారుల్లోని నైపుణ్యాలు, సామర్థ్యాన్ని వెలికితీసేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

క్రీడా మైదానాల పరిశీలన

సి.బెళగల్: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సంబంధించి పోలకల్, సి.బెళగల్, కంబదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడా మైదానాలను మంగళవారం ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఆటల పోటీల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, పీఈటీలతో ఎంపీడీఓ చర్చించారు. సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్ పీడీ సుంకరావు, పంచాయతీ కార్యదర్శులు సునీల్ రాజీ, నాగరాజు, కృష్ణప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌ఆర్ నియామకాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

కర్నూలు (హాస్పిటల్): మెడికల్ కళాశాలలో సీనియర్ రెసిడెంట్లుగా పనిచేసేందుకు బుధవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 82 మంది సీనియర్ రెసిడెంట్లను వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నామన్నారు. కళాశాలలోని ఆడిటోరియంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

ఒత్తిడి అధిగమించాలంటే యోగా చేయాలి

కర్నూలు(టౌన్): ఒత్తిడిని అధిగమించాలంటే ప్రతి ఒక్కరు యోగా చేయాలని రాజ్య సభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ సూచించారు. ఈనెల 16, 17 తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్‌లో నిర్వహించనున్న రెండవ ప్రపంచ యోగ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు పాల్గొనడం శుభపరిణామం అన్నారు. మంగళవారం టీజీ నివాసంలో అంతర్జాతీయ యోగ పోటీలకు ఎంపికైన యోగా క్రీడాకారులను ఆయన అభినందించారు. క్రీడాకారులకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్న యోగా క్రీడాకారుల్లో ఎస్.ప్రసన్న, కె.మునిస్వామి, ఎం.మనీషా, గురుప్రీతి, మనుశ్రీ, పలనాటి మనస్వినీలు ఉన్నారు.

● గుంత పూడ్చండి సారూ!



రెండు నెలల క్రితం పైప్‌లైన్ కోసం తవ్వి అలాగే వదిలేసిన గుంత

కర్నూలు(న్యూటౌన్): ఓల్డ్‌సిటీలోని 3వ వార్డు అలీషేర్‌బాగ్‌లో రెండు నెలల క్రితం తాగునీటి పైప్‌లైన్ కోసం గుంత తవ్వారు. అనంతరం గుంతను పూడ్చకుండా అలాగే వదిలేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. అటువైపు కాలినడక వెళ్లాలంటే వృద్ధులు, పిల్లలు జారి గుంతలో పడతామేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక సంస్థ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తజనం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న (నరసింహ) స్వామి దేవాలయం వేలాది మంది భక్తులతో సందడి నెలకొంది. మంగళవారం అమావాస్య ఉండడంతో భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకోవడానికి వేలాదిగా తరలివచ్చారు. కార్తీక మాసం చివరిరోజు కావడంతో తరలివచ్చిన భక్తజనంతో ఆలయ పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. స్వామివారి దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. భక్తులకు విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, శ్రీఘ్ర దర్శనం, ఉచిత, వీఐపీ దర్శనాల ద్వారా దర్శనానికి పంపారు. ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లో కూడా భక్తులు గంటకు పైగా నిలబడి స్వామివారి దర్శనం చేసుకున్నారు. కొందరు భక్తులు పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల సౌకార్యర్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప డిపోలవారు ప్రత్యేక బస్సులను నడిపారు. కౌతాళం పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉద్యాన పంటల సాగు పెంచేందుకు చర్యలు తీసుకోవాలి

- పార్లమెంట్‌లో ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కర్నూలు(రాజ్‌విహార్): ఉద్యాన పంటల సాగును పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ కోరారు. మంగళవారం ఆయన పార్లమెంట్‌లో ప్రశ్నోత్తరాల సమయంలో గ్లోబల్ ట్రేడ్‌లో హార్టికల్చర్ షేర్స్ అంశాన్ని లేవనెత్తారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య ప్రపంచంలో దేశం చాలా తక్కువగా కేవలం 1 శాతం మాత్రమే ఉందని, కూరగాయలు, పండ్ల తోటలు పెంచాల్సిన అవసరం ఉందని సభ దృష్టికి తెచ్చారు. రైతుల మేలు కోసం రవాణా, మౌలిక సదుపాయాలు, అస్థిరమైన సరఫరా, పంట నిల్వ కోసం గోదాముల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ మండా సమాధానం ఇస్తూ.. ఉద్యాన పంటల సాగును పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు.



ప్రత్యేక అలంకారంలో పంచముఖ ఆంజనేయస్వామి



హోమంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, పల్లకీసేవ, శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 27 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం, మహా అన్నప్రసాదం వితరణ కార్యక్రమాలు జరిగాయి. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం సందేశమిచ్చారు.

● స్థానిక సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో లోక కల్యాణార్థం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవగ్రహ లక్ష్మీ గణపతి, మూల మంత్ర సహిత చండీహోమం తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

జనవరి 15న గృహప్రవేశాలు జరిగేలా చూడాలి

- హౌసింగ్ అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన





మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): వచ్చేనెల 15న గృహప్రవేశాలు జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్‌డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెగా కంప్లిషన్ డ్రైవ్‌లో జిల్లాలో 15 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. రోజువారి లక్ష్యాల సాధనలో భాగంగా ఎమ్మిగనూరు, ఆస్పరి, కోడుమూరు, కల్లూరు, కృష్ణగిరి, మంత్రాలయం, గోనెగండ్ల, కోసిగి, ఆలూరు ఆదోని, తుగ్గలి, పెద్దకడబూరు, చిప్పగిరి, గూడూరు మండలాల్లో పురోగతి లేదన్నారు. ఆప్షన్–3 కింద నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనుల్లో పురోగతి లేకపోతే సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులు జరుగుతున్న సమయంలో ఎవరికీ చెప్పకుండా మధ్యలో నిలిపి వేసి వెళ్లిపోతే వారి నుంచి చేసిన ఖర్చును రికవరీ చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైతే బ్యాంకులు రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ సిద్ధలింగమూర్తి, ఎల్‌డీఎం రామచంద్రరావు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలియజేయండి

- నగరపాలక కమిషనర్ భార్గవతేజ



మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ భార్గవతేజ

కర్నూలు (టౌన్): నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని నగరపాలక కమిషనర్ భార్గవతేజ చెప్పా రు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముసాయిదా జాబితాలో వచ్చిన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలోని మరణాలు, వలసలు, పునరావృతమైన ఓట్లు, కావాల్సిన మార్పులు, కొత్త ఓటర్ల నమోదు వంటి పలు అంశాలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. సచివాలయాల పరిధిలో బూత్ లెవల్ ఆఫీసర్ల పరిధిలో ఓటర్ల సర్వే చేస్తున్నామని చెప్పారు. కర్నూలు నగర పరిధిలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే నగరంలోని వివిధ పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక నమోదు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటరు ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు, ఫిర్యాదులు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. అంతకుముందు ఫారం–6, 7, 8 ద్వారా నమోదైన దరఖాస్తుల పురోగతిని కమిషనర్ సమీక్షించారు. సమావేశంలో కర్నూలు అర్బన్ తహసీల్దార్ విజయశ్రీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ స్టోర్‌లో చోరీ

కర్నూలు: వెంకటరమణ కాలనీలోని ప్రసన్న మెడికల్ స్టోర్‌లో చోరీ జరిగింది. నిర్వాహకుడు లోకేష్ సోమవారం రాత్రి వ్యాపారం ముగించుకుని షటర్ వేసి ఇంటికెళ్లాడు. మంగళవారం ఉదయం దుకాణానికి వచ్చి చూసేసరికి షటర్ కొంత భాగం తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా టేబుల్ డ్రాయర్‌లో ఉన్న డబ్బు కనిపించలేదు. దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకుని రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాదాపు రూ.40 వేలకు పైగా చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

అఖిల భారత కిసాన్ సభలు విజయవంతం చేయండి

గూడూరు: కర్నూలులో ఈ నెల 15 నుండి 17 వరకు జరిగే అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలను విజయ వంతం చేయాలని సీఐటీయూ కోడుమూరు డివిజన్ కార్యదర్శి మోహన్ కోరారు. మంగళవారం పట్టణంలో ఏఐకేఎస్ జాతీయ కౌన్సిలల్ సమావేశాల కర పత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు దానమన్న, పెద్ద సుధాకర్, హమాలీలు కృపానందం, సురేష్, అబ్రహాం, ఏసెపు పాల్గొన్నారు.

సమావేశాలు జయప్రదం చేద్దాం

కల్లూరు: ఈనెల 15, 16, 17 తేదీలలో జరిగే అఖిల భారత రైతు సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేద్దామని సీఐటీయూ మండల కార్యదర్శి మధు, రైతు సంఘం మండల కార్యదర్శి కృష్ణ కోరారు. మంగళవారం పెద్దపాడు గ్రామంలో జీపు జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై చర్చించేందుకు మహా సభ తోడ్పడుతుందన్నారు.

16న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

కర్నూలు సిటీ: ఈనెల 16న టౌన్ మోడల్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఉంటుందని డీఈఓ రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో నేడు, రేపు జరగనున్న మండల స్థాయి విజేతలు పాల్గొంటారని, జిల్లా స్థాయిలో గెలిస్తే రాష్ట్ర స్థాయి పోటీలకు వెళతారన్నారు. ఎగ్జిబిషన్‌కు హాజరయ్యేవారు ఉదయం 8 గంటలకే చేరుకోవాలన్నారు.

స్టెమి ప్రోగ్రామ్‌పై వైద్యులకు వర్క్‌షాప్

కర్నూలు(హాస్పిటల్): స్టెమి/ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ వర్క్‌షాప్‌పై వైద్యులకు మంగళవారంస్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలోని 50 మంది వైద్యులకు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్‌పై వివరించామన్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా రిఫ్రెషింగ్ కోర్సు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో డీసీహెచ్ కింద పనిచేసే జనరల్ మెడిసిన్ వైద్యులు, జీజీహెచ్‌లోని మెడికల్ విభాగం వైద్యులు పాల్గొన్నట్లు చెప్పారు. గుండెపోటు వచ్చే కారణాలు, ఈసీజీలో వచ్చే మార్పులు, అత్యవసర ట్రీట్‌మెంట్ ఇవ్వడం, థ్రాంబోలైసిస్ చేయడం, రోగులను 108 అంబులెన్స్ ద్వారా ఎలా ఆసుపత్రికి తీసుకురావాలి, ఆసుపత్రికి వచ్చిన తర్వాత రోగికి స్టెంట్ ఎలా వేస్తారు, బైపాస్ సర్జరీ ఎలా చేస్తారనే విషయాలపై కార్డియాలజీ వైద్యులు శిక్షణ ఇచ్చారన్నారు. ఈ తరహా కోర్సులు ఇప్పటి వరకు గుంటూరు, వైజాగ్‌లో మాత్రమే జరిగాయన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ లక్ష్మిబాయి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ మహేశ్వరరెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ లలిత, ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.